# నీలో దీపం వెలిగించు

## "మిర్రర్"



సుజాత-

ఆఫీసులో అడుగు పెట్టగానే-

మేనేజరు పిలుస్తున్నారు అని చెప్పాడు మెసేంజరు వచ్చి

తన సీటులో హేండ్‌బేగ్ సర్దుకుని మరు నిముషంలో మేనెజరు కేబిన్‌లో ప్రవేశించి విష్ చేసింది

హెడ్డాఫీసుకి వెళ్ళవలసిన రిపోర్టు ఈ సాయంకాలానికి రడీ అయిపోవాలి అన్నాడు ఆయన ఆమె వంక చూడకుండానే

యస్ సార్ అని జవాబు చెప్పి తన సీటుకి తిరిగి వచ్చింది

తన సీటులో ఈ మధ్య వర్క్‌లోడ్ చాలా పెరిగి పోయింది అంతకు ముందు ఇదే పనికి ఇద్దరు వుండేవారు ఒక అసిస్టెంటును ప్రొవైడ్ చెయ్యమని ఎన్నిసార్లు అడిగినా ఆ విషయం పట్టించుకోని మేనేజరు, వర్క్ డిలే అయినప్పుడు మాత్రం కఠినంగా వ్యవహరిస్తుంటాడు

వర్క్ విషయంలో తనకున్న ఇబ్బందులు అతనితో చెప్పుకుని ప్రయోజనం లేదన్న విషయం గ్రహించి ప్రతిసారీ తనే సర్దుకు పోతూంది

అందులో ఇప్పుడు తను ప్రమోషన్ జోన్‌లో వుంది ఈ సమయంలో మేనేజరుతో వివాదం తనకే మంచిది కాదు

అందువల్ల రిపోర్టుకి సంబందించిన కాగితాలు ముందు వేసుకుని మరుక్షణం పనిలో బిజి అయిపోయింది సుజాత

సాయంత్రానికి రిపోర్టు తయారు అయింది

కానీ అప్పటికి సుజాతకి జ్వరం వచ్చినట్టుగా వుంది గొంతు ఎండి పోతూంది వెంటనే పడుకుని విశ్రాంతి తీసుకోవాలన్నంత నీరసంగా వుంది

రెండు నెలల కిందట తనకి ఎబార్షన్ అయింది అప్పటి నుంచి ఆరోగ్యం బాగుండటం లేదు సాయంత్రం అయ్యేసరికి దాదాపు ప్రతిరోజూ జ్వరం వస్తూంది ఒక నెల రోజులు సెలవుపెట్టి విశ్రాంతి తీసుకోవాలని వుంది కానీ తను ఇప్పుడు ప్రమోషన్ జోన్‌లో వున్నందువల్ల విధిగా ఆఫీసుకి రావలసి వస్తూంది

ఎంతకీ రాని బస్సుకోసం ఎదురు చూసి విసిగిపోయి ఆటోలో ఇల్లు చేరుకుంది ఈ పని తను ముందే చేసివుంటే బాగుండేది అనుకుంది మనసులో

కాళ్ళు కడుక్కుని వచ్చి ముందు రూములో సోఫాలో కూర్చుంది అప్పటికి ఇంకా రమణమూర్తి రాలేదు

రమణమూర్తితో తనకి పెళ్ళి అయి రెండు సంవత్సరాలు అయింది పెళ్ళికి ముందు నుంచీ తను ఉద్యోగం చేస్తూంది తను సంపాదించి కూడబెట్టిన డబ్బుతో తండ్రి తన పెళ్ళి జరిపించాడు

పెళ్ళికి ముందు తన వైవాహిక జీవితంపై కొన్ని ఆశలు పెంచుకుంది

చిన్న ఇల్లు, చిన్న సంసారం లాంటి చిన్న చిన్న కోర్కెలు మాత్రమే పెంచుకున్న తనకి అవి అందని పళ్ళు అయిపోయాయి

పనిమనిషి రాలేదు తల్లీ అంట్లు గిన్నెలు అలాగే పేరుకు పోయాయి లేచి వాటి పని చూడు మీ మామగారి భోజనానికి ఆలస్యం అయిపోతూంది అంది అత్తగారు వచ్చి

తనకి నీరసంగా వుందని ఆ పని తన వల్ల కాదని చెప్పలేక పోయింది సుజాత ఒకవేళ తను ఆ పని చెయ్యలేకపోతే ఆ తరువాత జరిగే యుద్ధం తను భరించ లేదు

అందువల్ల లేచి అంట్లు గిన్నెల ముందు కూర్చుంది

అందరి భోజనాలు అయింతరువాత వంట ఇల్లు సర్ది బయటపడేసరికి రాత్రి పదకొండు అయింది

రమణమూర్తి అప్పటికే నిద్రపోతున్నాడు

తను భోజనం చేయలేదన్న విషయం ఎవరూ పట్టించుకో లేదు అందుకూ బాధ లేదు కానీ తన ఆరోగ్యం గురించి పరామర్శించి, తన చేత్తో ఒక మందు బిళ్ళ అందించితే ఎంతో రిలీఫ్‌గా వుండేది కానీ అతనికి తన స్నేహితులతో గటపటంలో వున్న ఆనందం భార్య ప్రక్కన వున్నప్పుడు రాదు

అసలు భార్యతో అంటి పెట్టుకుని తిరిగితే తను అలుసు అయిపోతానన్న భావం అతనికుంది

అసలే గ్రాడ్యుయేట్ అందులో తనతో సమానంగా సంపాదిస్తూంది కాబట్టి ఏ క్షణంలో నైనా తనని గడ్డిపోచగా తీసి పారెయ్యవచ్చు అందువల్ల భార్య ముందు తను రిజర్వ్‌డుగా వుండటం మంచిది అనే ధోరణి అతనిది

మరునాడు జ్వర తీవ్రత హెచ్చింది రాత్రి భోజనం చేయనందువల్ల నీరసంగా వుంది

రమణమూర్తి లేచి బేడ్మింటన్ ఆడుకోవటానికి వెళ్ళి పోయాడు ఇంట్లో ఇతర సభ్యులు ఎవరి

పనిలో వారున్నారు.

ఈ రోజుకి సెలవు పెట్టి ఇంట్లో కళ్ళు మూసుకు పడుకోవాలని వుంది. కానీ సెలవుపెట్టి ఇంట్లో వుంటే అత్తగారు క్షణంసేపు ఖాళీగా వుండనీయదు. మంచం నవ్వారు పట్టీలు బిగించటం మొదలు వంటింటి డబ్బాలు శుభ్రం చేయటం లాంటి అర్థమైన పనులూ పురమాయిస్తుంది. ఈ బాధ కంటె ఆఫీసు నయం.

సుజాత ఆఫీసు చేరుకునే సరికి ఆమె తండ్రి ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు.

ఆయన వుండేది కూడా హైదరాబాదులోనే అయినా ఆ మధ్య వచ్చిన ఏవో గొడవల వల్ల, సుజాతని చూడటానికి ఆయన ఇంటికి రాకుండా ఆఫీసుకే వచ్చి కూతురుని పరామర్శించి వెళ్ళటం అలవాటు చేసుకున్నాడు.

తండ్రిని చూసేసరికి సుజాతకి దుఃఖం పొంగుకు వచ్చింది.

తన కష్టాలు తండ్రికి చెప్పుకోవాలనిపించింది. కానీ ఈ వయసులో ఆయనకి మనస్తాపం కలిగించటం తప్ప మరో ప్రయోజనం వుండదని వూరుకుంది.

"నీ తమ్ముడు గోపాలంకి ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం వచ్చింది. కానీ రెండు వేల రూపాయిలు సెక్యూరిటీగా డిపాజిట్ చెయ్యమన్నారు. నా పరిస్థితి నీకు తెలియంది కాదు. ఈ సమయంలో నువ్వు డబ్బు సర్దితే వాడి జీవితం ఒక మార్గాన పడుతుంది. నెమ్మదిగా అప్పు తీర్చుకుంటాడు." అన్నాడు ఆయన తను వచ్చిన విషయం ప్రస్తావిస్తూ.

సుజాత మీమాంసలో పడిపోయింది.

తన వద్ద రడీగా డబ్బులేదు. అసలు తనదంటూ తన ఎక్కవుంట్‌లో డబ్బు ఏనాడూ లేదు. జీతం రాగానే తెచ్చి భర్తకి ఇవ్వటం అలవాటు. అందులోంచి కొంత ఖర్చులకి తీసి తనకి ఇస్తుంటాడు. మిగిలినది ఆయన తన స్వంత ఎక్కవుంట్‌లో దాస్తుంటాడు.

గతంలో ఒకసారి ఏదో అవసరానికి తండ్రికి డబ్బు సర్దింది. ఆ విషయంలో ఇంటి వద్ద పెద్ద గొడవే అయింది. ఆ సంగతు లేవీ తను తండ్రికి తెలియనీయ లేదు.

అలా అని చెప్పి ఇప్పుడూ తండ్రికి డబ్బు లేదని చెప్పలేకుండా వుంది. తన చదువు కోసం తండ్రి ఎంత కష్టపడవలిసి వచ్చిందో తనకి బాగా తెలుసు. ఈ రోజున తన తమ్ముడికి జీవిత సమస్యలో సహాయం చేయలేక పోవటం తనకే తలవంపులుగా వుంది.

తన పరిస్థితి తనకే అసహ్యకరంగా వుంది.

ఈ రోజున తనకి అన్నీ వున్నాయి.

తను బియే పాసు అయింది.

గవర్నమెంటు ఉద్యోగం వుంది.

హోదా వుంది.

సమాజంలో పరువు వుంది.

ఆదాయం వుంది.

అందమైన భర్త వున్నాడు.

కానీ ఎన్ని వున్నా –

తనని అర్థం చేసుకునేవారు లేరు.

తన పట్ల సానుభూతి చూపేవారు లేరు.

తనకి స్వాతంత్ర్యం లేదు.

భర్తకి తను సంపాదించే డబ్బుమీద వున్న ఆసక్తి తనమీద లేదు.

ఎందుకీ బ్రతుకు?

చనిపోవటం మేలు అనుకుంది.

ఆడవాళ్ళు ఆత్మహత్య చేసుకున్న ఉదంతాలు వార్తాపత్రికల్లో చదివినప్పుడు అలా వాళ్ళెందుకు చనిపోతుంటారో చిన్నప్పుడు అర్థం అయేది కాదు.

కానీ ఇప్పుడు తనున్న పరిస్థితులలో, ఆడవాళ్ళు ఆత్మహత్య ఎందుకు చేసుకుంటారో అర్థం అయిపోయింది.

తనకి అనారోగ్యంగా వున్నా ఆఫీసులో పని తప్పదు. పని చేసినా ప్రోత్సాహం లేదు.

అనారోగ్యం కారణంగా ఉద్యోగానికి రాజీనామా చేయాలనుకుంటే అందుకు భర్త అంగీకరించ లేదు.

సంపాదించే డబ్బుమీద తనకి అధికారం లేదు. తన తల్లిదండ్రులకి ఆర్థిక సహాయం చేసే స్వాతంత్ర్యం లేదు.




**తన ఈ బాధలు చెప్పుకునేందుకు మనిషి తోడు లేదు.**

**ఇలాంటి వ్యర్థ జీవితం గడిపే కంటే మరణించటం మంచిదని నిర్ణయించుకుంది.**

**సుజాత నుంచి ఎంతకీ జవాబు రాకపోయే సరికి, ఆమె అశక్తతను గ్రహించిన ఆమె తండ్రి–**

"పోనీలే తల్లీ. నీకు వీలుపడక పోతే బాధపడకు. మరో మార్గంలో ప్రయత్నిస్తాను. నువ్వు సంతోషంగా వుంటే అంతే చాలు. నువ్వు బాధపడుతుంటే నేను చూడలేను" అన్నాడు.

ఆ సమయంలో తండ్రి ముఖం చూడలేక తల అటు తిప్పుకుంది.

"నువ్వు బాధపడుతుంటే నేను చూడలేను" అన్న ఆయన మాటలు పదే పదే ఆమె మనసులో మారు మ్రోగసాగాయి.

"చనిపోవటం మంచిది" అని క్షణం ముందు తను తీసుకున్న నిర్ణయం ఎంత అర్థరహిత మైనదో తెలిసింది.

చనిపోవటం వల్ల సాధించేది ఏమీ లేకపోగా, కన్న తండ్రికి, ఇతరులకు దుఃఖం కలిగించిన దవుతుంది తను.

అంత చదువుకుని, తెలివి తేటలు వుండి ఆత్మహత్య అనే ఆలోచనలో పడిపోయినందుకు సిగ్గు పడింది.

తన చదువుకి, వివేకానికి సార్థకత చేకూరేలా తను చేయవలసింది ఏదో వుందని ఆమె క్షణకాలం మనసులో మెదిలింది.

వెంటనే లేచి ఎక్కవుంట్స్ సెక్షనుకి వెళ్ళి "లోన్" తీసుకుని డబ్బు తండ్రికి ఇచ్చి పంపించింది.

అంతేకాక –

ఆ రాత్రి తన పరిస్థితి, ఇబ్బందులు, అభిరుచులు, ఆశయాలు, అవసరాలు అన్నీ స్పష్టంగా భర్తకి వివరంగా చెప్పింది.

అతను ఎప్పటిలా ఉదాసీనత ప్రదర్శించాడు.

వారం రోజులు తరువాత ఆమె తన నిర్ణయం అమలు జరిపింది.

"నేను సంపాదించే డబ్బుమీద కాక నామీద మీకు అభిమానం కలిగిన రోజున కబురు పంపండి. తిరిగివస్తాను"–

అని కాగితం వ్రాసి వుంచి,

తను ఆ ఇంటి నుంచి విడిపోయి వర్కింగ్ వుమెన్సు హాస్టలులో చేరిపోయింది.

**తనని ఎవరో బాధ పెడుతున్నారని చింతిస్తూ, జీవచ్ఛవంలా బ్రతకకుండా, తన జీవితంపై తానొక నిర్ణయం తీసుకుని, తన బ్రతుకు బాటను సరిదిద్దుకుని తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటూ స్వేచ్ఛగా బ్రతక గలుగు తున్నందుకు, ఇప్పుడు సుజాతకి ఎంతో తృప్తిగా వుంది.** □